480) సాళంగనాట/దేశి

ప॥ కంటిరా వింటిరా కమలనాథునిశక్తి। వొంటి నితనిశరణ మొకటే వుపాయము ॥

చ॥ యీతనినాభి బొడమె యెక్కువైనబ్రహ్మయు। యీతడే రక్షించినాడు యింద్రాదుల।
యీత డాకుమీద దేలె నేకార్ణవమునాడు। యీతడే పో హరి మనకిందరికి దైవము ॥

చ॥ యీతడే యసురబాధ లిన్నియు బరిహరించె। నీతనిమూడడుగులే యీలోకాలు।
యీతడే మూలమంటే నేతెంచి కరి గాచె। నీతనికంటే వేల్పులిక మరి కలరా ॥

చ॥ యీతడే వైకుంఠనాథు డితడే రమానాథు-। డితడే వేదోక్తదైవ మిన్నిటా దానె।
యీతడే అంతర్యామి యీ చరాచరములకు। నీతడే శ్రీవేంకటేశు డిహపరధనము ॥